నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. 11కేవీ శివాజీనగర్ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మార్కెట్ పక్కన రోడ్డు, సంతోష్‌నగర్, సుక్కమ్మకుంట, విఘ్నేశ్వర కాలనీ, భద్రయ్యకుంట, సుభద్రమ్మ కాలనీ, వీకే.ఎన్‌క్లేవ్, కల్యాణ్ సులోచన, శ్రీరామ్‌నగర్, మార్వాడిలైన్, ప్రభుత్వ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబశివరావు తెలిపారు.

ఘట్‌కేసర్: విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ యశ్వంత్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చందుపట్లగూడ, ఏదులాబాద్, పోతురాయిగూడ, కొత్తగూడ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కీసర: కుందన్‌పల్లి సాయికృప కాలనీలో కరాటే మాస్టర్ చీర్యాల జంగయ్య నేతృత్వంలోని సన్ బడోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో కరాటేలో శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకున్న విద్యార్థులకు ఆదివారం వెంకటేష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై సర్టిఫికెట్లు, గ్రేడింగ్ బెల్టులు ప్రదానం చేశారు.

జగదాంబ ఆలయంలో 'భోగ్ భండార్'



కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీ- బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్

ఘట్‌కేసర్: ఘణపురంలోని ఫకీర్ టెక్యా తండాలో కొలువైన జగదాంబదేవీ సహిత సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ఆదివారం జెండా పూజ సందర్భంగా 'భోగ్ భండార్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ బీ- బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్‌లు నానావత్ రూప్‌సింగ్ నాయక్, బద్దం గోపాల్‌రెడ్డి, స్థానిక నేతలు రాజునాయక్, హుస్సేన్, సురేష్‌నాయక్, కిషన్, సురేష్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

అల్వాల్: మహిళ అదృశ్యమైన ఘటన నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్ దీన్‌దయాల్‌నగర్‌లో నివసించే దాసాని రఘోత్తమ్‌రెడ్డి, భార్య సత్యలక్ష్మి (25)లకు తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈనెల 8న ఇంట్లో గొడవ జరగడంతో భార్య ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణల జోరు !

పట్టించుకోని పుర యంత్రాంగం
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- జీహెచ్ఎంసీ సర్కిళ్లలో పార్కుల కబ్జా

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు పురపాలక సంఘాల్లో భవన నిర్మాణాలు రోజురోజుకు పెరుగుతోంది. ఎటు చూసినా బహుళ అంతస్తుల జోరు కనిపిస్తోంది. చిన్న వీధుల్లో కూడా 3–4 అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. కనీసం అగ్నిమాపక యంత్రాలు తిరిగేలా స్థలాలు ఉండాలనే విషయాన్ని ఆయా ఇళ్ల యజమానులు మర్చిపోతున్నారు. పైగా ఇంటికి ఆనుకుని కొత్త భవన నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనతో...

అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)దరఖాస్తుల విచారణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలతో ఇరిగేషన్ ,రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ శాఖలు క్షేత్రస్థాయి పరిశీలనకు శ్రీకారం చుట్టగా.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇష్టానుసారంగా వెలుస్తున్న అక్రమ కట్టడాలు, లేఅవుట్లతో పాటు రోడ్లు, పార్కులను కబ్జాచేసి నిర్మిస్తున్న భవనాలు, బహుళ అంతస్తులు, ఇండిపెండెంట్ ఇళ్లు వెలుగులోకి వస్తున్నాయి. పనుల ఒత్తిడి, పలు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో సంబంధిత అధికారులు వీటిపై దృష్టి సారించకపోవడంతో కొందరు ఉద్యోగులు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

భారీగా వసూళ్లు...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 16 పురపాలక సంఘాల పరిధిలో వెంచర్లు, లేఅవుట్లు, ఇండిపెండెట్ ఇళ్లు, అపార్టుమెంట్లు నిర్మిస్తున్న వారి నుంచి అడ్డగోలుగా పలువురు పెద్దలు, ఉద్యోగులు అక్రమంగా వసూలు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

◆ శామీర్‌పేట, ఎంసీపల్లి మండలాల పరిధిలోని లింగాపూర్ తండా, లక్ష్మాపూర్, మజీద్‌పూర్, దేవరయాంజల్, కోల్తూర్ తదితర ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఫామ్‌ల్యాండ్, అక్రమ వెంచర్లు వెలిసినా.. పట్టించుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. బోడుప్పల్, పీర్జాదిగూడ, నాగారం, పోచారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్ పురపాలక సంఘాల పరిధిలోని పలు కాలనీల్లో ప్రతిరోజు ఏదో ఒక డివిజన్‌లో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పురపాలికల్లో ఇటీవల విలీనమైన పంచాయతీలతో పాటు ప్రస్తుత జీపీల్లో కూడా అక్రమ కట్టడాలు, లేఅవుట్లు కొనసాగుతున్నాయి. బొమ్మరాసిపేట మూడుచింతలపల్లి, తుర్కపల్లి, బాబాగూడ, అంకిరెడ్డిపల్లి, బోగారం, కీసర, చీర్యాల, గోధుమకుంట, తిమ్మాయిపల్లి, యాద్గార్పల్లి, అలియాబాద్, లింగాపూర్ తండా, చౌదరిగూడ, కొర్రెముల, కాచవాని సింగారం, నూతనకల్లు, రాయిల్పూర్, సైదోనిగడ్డ తండాలలో పెద్దఎత్తున అక్రమ కట్టడాలు, లేఅవుట్లు నిర్మిస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

సర్కిళ్ల పరిధిలో..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పరిధిలోని జీహెచ్ఎంసీ సర్కిళ్ల పరిధిలో పార్కులు, రోడ్లు ఆక్రమించి అక్రమ కట్టడాలు వెలిసినట్లు గుర్తించారు. జిల్లాలోని ఉప్పల్ సర్కిల్‌లో 1989 చదరపు గజాల స్థలం, కాప్రా సర్కిల్‌లో 194 చదరపు గజాల స్థలం, మల్కాజిగిరి సర్కిల్‌లో 36 చదరపు గజాలు, మూసాపేట్‌లో 20, కూకట్‌పల్లిలో 455, కుత్బుల్లాపూర్‌లో 62, గాజులరామారంలో 198 , అల్వాల్ సర్కిల్‌లో 155 చదరపు గజాల స్థలం ఆక్రమణకు గురయ్యాయి. ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ భూముల్లో వెలుస్తున్న నిర్మాణాలపై అధికార యంత్రాంగం సీరియస్‌గా ఉన్నా.. అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు.



పోచారంలో చేపట్టిన భవన నిర్మాణాలు



రాంపల్లి, నాగారంలో..

'సమాచార హక్కు చట్టంతో అవినీతిని నిర్మూలించాలి'



శామీర్‌పేట్: సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి ప్రభుత్వంలో అవినీతిని ఎదుర్కోవడానికి ప్రజలను ప్రోత్సహించడం కమిటీ ముఖ్య ఉద్దేశమని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డా.చంటి ముదిరాజ్ అన్నారు. ఆదివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట బృందావన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా కార్యాచరణ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ అనేది సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయడానికి, పౌరులకు సమాచారాన్ని పొందే హక్కును ఉపయోగించడంలో సహాయపడటానికి ఏర్పడిన కమిటీ అన్నారు. ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, సమర్థవంతంగా అమలు చేయడానికి, పర్యవేక్షించడానికి ప్రభుత్వంతో కలిసి కమిటీ పనిచేస్తుందన్నారు. ఈ సదస్సుకు మేడ్చల్ జిల్లా కన్వీనర్ రామకృష్ణముదిరాజ్ అధ్యక్షత వహించారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్. దిలీప్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపినాథ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు అశోక్, అధికార ప్రతినిధి నాగరాజు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జ్ భాస్కర్‌నాయక్, జిల్లా నాయకులు మధు, రఘుపతి, జంగయ్య, నవీన్, వినోద్, వెంకటేశం, మనోహర్ పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం



కుషాయిగూడ: శ్రవణ నక్షత్రం సందర్భంగా ఆదివారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, మంగాపురం కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ వేడుకల్లో 25 మంది జంటలు పాల్గొన్ని స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.బీ రవీంద్రరెడ్డి, జ్యోతి, ఉదయ్, కిరణ్‌కుమార్, ఎల్లవ్వ, అనిల్‌కుమార్, సమ్మయ్య, మల్లికార్జున్, నవీన్‌కుమార్‌గౌడ్, అర్చకులు రామాచార్యులు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో శ్రీవారి కల్యాణం ముడుంబై వెంకటరమణాచార్యులు, తులసీ రమణాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతినెలా రెండో ఆదివారం శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్నామని ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, క్లర్క్ సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

గంజాయి నిందితుల రిమాండ్

ఘట్‌కేసర్: గంజాయి సేవిస్తున్న వారిని ఘట్‌కేసర్ పోలీసులు ఆదివారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో ఓ ఇంట్లో గంజాయి సేవిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఇంటిని సోదా చేశారు. ఇంట్లో గంజాయి సేవిస్తున్న అరవింద్ (25),ఉదయ్ కిరణ్ (22), కార్తీక్ (19), శివ (22), వినోద్ (23)ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 460 గ్రా. గంజాయి, 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరచగా.. రిమాండ్ విధించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



కీసర: రామలింగేశ్వర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తమ్ పటేల్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్‌పటేల్ చేతుల మీదుగా విద్యార్థులకు నోట్‌బుక్స్, మెరిట్ అవార్డులను అందజేశారు. సంఘం అధ్యక్షుడు మహేందర్ పటేల్, వెంకటేశ్వర్‌పటేల్, కోశాధికారి రమేష్ పటేల్, సభ్యులు సురేష్, శ్రీనివాస్, వెంకన్న, లక్ష్మణ్, నరేష్, భాస్కర్, కృష్ణ, రాజలింగం, రమేష్, నవీన్, శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కీసరలో జ్ఞానమాలలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అంబేడ్కర్ సంఘం సభ్యులు

కీసర: బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. కీసర మండలం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 180వ జ్ఞానమాల కార్యక్రమానికి కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సై వెంకటేష్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షులు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, కోశాధికారి శ్యామ్‌కుమార్, కార్యదర్శులు శంకరయ్య, సుధాకర్, మాజీ ఎంపీటీసీలు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, జంగయ్యయాదవ్, బాల్‌రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ రాజలింగం, బీఆర్ఎస్ నేతలు శ్రీధర్‌రెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్: ప్రబుద్ధ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అంకుషాపూర్ మాజీ సర్పంచ్ బత్తుల రామలింగంగౌడ్ పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలను అందరూ అనుసరించాలన్నారు. అంబేడ్కర్ అభిమాన సంఘాల ప్రతినిధులు మేకల దాస్, కట్టూరి నర్సింగ్‌రావు, సత్యం , మీసాల రాజేష్‌కుమార్, సురేష్, సుధాకర్, అశోక్, లలితప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి



ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిని కలిసిన మౌలాలి దర్గా ముజవార్స్

మౌలాలి : ప్రసిద్ధి చెందిన మౌలాలి దర్గాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని దర్గా ముజవార్స్ (నిర్వాహకులు) కోరారు. ఈ మేరకు బీఆర్ఎస్ నేత వంశీముదిరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని ఆదివారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మౌలాలి గుట్టపైన ఉన్న దర్గాకు ఎలక్ట్రికల్ మీటర్, డ్రైనేజీ వ్యవస్థ, పవర్‌బోర్ ఏర్పాటు తదితర అంశాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. స్పందించిన ఆయన సంబంధిత విద్యుత్, జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నేతలు వంశీముదిరాజ్, మహ్మద్‌ఉస్మాన్, షరీఫ్, జుబైర్, దర్గా ముజవార్స్ సాయిద్, షౌకత్ అలీ, అర్షద్, జకీర్, బబ్బు తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



పనులను పరిశీలిస్తున్న నాచారం కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం సాయినగర్ కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని నాచారం కార్పొరేటర్ శాంతి అన్నారు. ఆదవారం నాచారం సాయినగర్ కాలనీలో ఆమె పర్యటించిన ఆమె సొంత ఖర్చులతో 20 మీటర్ల ఆర్సీబీ స్లాబ్‌ను తొలగింపజేశారు. త్వరలోనే డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడతామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. స్థానిక నేతలు కట్ట బుచ్చన్నగౌడ్, చంద్రశేఖర్, స్వామి, రూప తదితరులున్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని భవానీనగర్ కాలనీలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ బస్తీబాట చేపట్టారు. కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానరోడ్డు, స్పీడ్ బ్రేకర్లు, డ్రైనేజీ తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నర్సింహ, కటకం సురేష్, బాబు, నిర్మలదేవి, శ్రీమన్నారాయణ, సిద్దేశ్వర్, పన్వార్, సతీష్ కాంగ్రెస్ నేతలు వీరాస్వామి, సుదర్శన్, శ్రీకాంత్‌రెడ్డి, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



భవానీనగర్‌లో పర్యటిస్తున్న అనిల్‌కుమార్

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ చేతన

రామంతాపూర్ : హబ్సిగూడ డివిజన్ పరిధిలోని శ్రీనివాసపురం కమ్యూనిటీహాల్‌లో యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ కక్కిరేణి చేతన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఆదివారం మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను పేద, మధ్యతరగతి ప్రజలు ఉపయోగించుకుని లబ్ధిపొందాలని సూచించారు. యశోద ఆసుపత్రి నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ గుండె తదితర వ్యాధుల నిర్ధారణ పరీక్షలతో పాటు సూచనలు చేయడం అభినందనీయమన్నారు. సంక్షేమ సంఘం ప్రతినిధులు మూర్తి, గాదె సత్యనారాయణ, కనిగిరి ప్రసాద్, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

6 కిలో మీటర్లు.. | 4 బ్లాక్ స్పాట్లు !

జాతీయ రహదారిపై ప్రమాదకర ప్రదేశాలు

- ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బంది
- అండర్‌పాస్‌ల కోసం ప్రజల ఎదురుచూపులు



జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ (ఫైల్)

పోచారం: హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్లే జాతీయ రహదారిపై తరచుగా ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రజలు ప్రమాదాల భారిన పడుతున్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలో సెంట్రల్ పవర్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీపీఆర్ఐ) నుంచి అన్నోజిగూడ ఫ్లై ఓవర్ వరకు జాతీయ రహదారి పొడవు సుమారు 6 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఈ రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేసి, ఇరువైపులా వరద నీరు వెళ్లేందుకు వీలుగా బాక్స్ నాలాలను నిర్మించారు. నాలాపై వాహనాలు వెళ్లకుండా గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు.

గుట్టుచప్పుడు కాకుండా తొలగింపు..

భారీ వాహనాలు తగిలి కొన్ని ధ్వంసమైతే, మరికొన్నింటినీ వ్యాపారస్తులు తమ దుకాణాలకు ఎదురుగా ఉన్నవాటిని గుట్టుచప్పుడు కాకుండా తొలగిస్తున్నారు. దీనిపై 'ఎన్‌హెచ్ఐఏ' ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తగిన చర్యలు తీసుకోవాలి..

సీపీఆర్ఐ నుంచి అన్నోజిగూడ చౌరస్తా వరకు 4 ప్రదేశాలు బ్లాక్ స్పాట్స్ (ప్రమాదకర ప్రదేశాలు)గా మారాయి. అన్నోజిగూడలో ఎన్టీపీసీ చౌరస్తా, చౌదరిగూడలోని జోడిమెట్ల చౌరస్తా, నారపల్లిలోని కొర్రెముల్ చౌరస్తా, దివ్యానగర్ చౌరస్తాలు బ్లాక్ స్పాట్స్‌గా మారాయి. ఈ ప్రదేశాల్లో జరిగిన ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌తో సమస్యకు పరిష్కారం



జోడిమెట్ల చౌరస్తా వద్ద అండర్‌పాస్‌తో పాటు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ (ఎఫ్ఓబీ) నిర్మించాలని పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నాం. చౌరస్తా పక్కనే ఉన్న మేధా కంపెనీలో వందల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. జాతీయ రహదారి దాటేందుకు వీరికి ఎఫ్ఓబీ ఉపయోగపడుతుంది. హైవేకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు ఉంటే ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాల భారి నుంచి ప్రజలకు విముక్తి లభిస్తుంది.

– వినోద్‌కుమార్, స్థానికుడు

ఎన్టీపీసీ చౌరస్తా వద్ద అండర్‌పాస్..

అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా వద్ద అండర్ పాస్ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. దీనిలో భాగంగా భూ పరీక్షలు కూడా పూర్తి చేసినట్లు సమాచారం.

సర్వీస్ రోడ్డన్నా వేయాలి...

బ్లాక్ స్పాట్స్ వద్ద అండర్ పాస్‌లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. దీంతో హైవేపై ప్రమాదాలకు నియంత్రించవచ్చని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఉప్పల్ నుంచి నారపల్లిలోని సీపీఆర్ఐ వరకు నిర్మాణంలో ఉన్న ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తయ్యేలోగా అన్నోజిగూడ ఫ్లై ఓవర్ వద్ద సర్వీసు రోడ్డును పొడిగిస్తే ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలను నివారించవచ్చు.

వేడుకగా అమ్మవారికి బోనాలు



మహంకాళి అమ్మవారు



గుండ్లపోచంపల్లిలో బోనాల వేడుకల్లో పాల్గొన్న నాయకులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం అమ్మవారి బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. గుండ్లపోచంపల్లిలో మహంకాళి అమ్మవారి బోనాల వేడుకలు నిర్వహించగా.. వేడుకల్లో మాజీ కౌన్సిలర్లు మల్లికార్జున్‌ముదిరాజ్, జైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు విక్రమ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

కీసర: నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. స్థానిక మహిళలు అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మహంకాళి, ఎల్లమ్మ అమ్మవార్లను ఎమ్మెల్యే మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, ఎంపీ ఈటల రాజేందర్ సతీమణి జమున దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శివసత్తుల నృత్యాలు, ఆటపాటలు ఎంతగానో అలరించాయి. మహంకాళి ఆలయ చైర్మన్ భూమయ్య యాదవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బోనాలతో మహిళలు



ఎంపీ ఈటల సతీమణి జమునను సత్కరిస్తున్న



రాంపల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే